# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






### ఒకరోజు బ్రహ్మోత్సవం విజయవంతానికి

# అధికారులు ఉరుకులు పరుగులు

**వాహనాల తండ్లు మరమ్మతులు**

**అసౌకర్యం లేకుండా భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు**





తిరుమల, జనవరి 20(ప్రభాతవార్త)ప్రతినిధి: సూర్యజయంతి పర్వదినం సందర్భంగా రానున్న ఆదివారం రథసప్తమిన ఏడు వాహనాలపై ఏడుకొండలస్వామి భక్తులను కటాక్షించనున్నారు. ఇందుకు ఆలయ మాఢవీధుల్లో ఏడు వాహనాల వీక్షణకు రెండులక్షలమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున గ్యాలరీల్లోకి సాఫీగా ప్రవేశించేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటుచేయడం జరిగింది. మాఢవీధుల్లో అత్యాధునిక సౌకర్యాలతో జర్మన్‌షెడ్లు నిర్మిస్తున్నారు. అందులో అత్యవసర మరుగుదొడ్ల సదుపాయం, అగ్నిమాపక నివారణ పరికరాలు, పోలీసు, విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలతో భద్రత కల్పిస్తున్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 1.25లక్షలమంది భక్తులు వేచివుండే అవకాశం ఉంది. ఒకరోజు బ్రహ్మోత్సవానికి రథసప్తమికి పటిష్టంగా ఏర్పాట్లు చేయడంతోబాటు భక్తుల నియంత్రణపై సమన్వయంతో వ్యవహరించేలా అధికారులు ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. భక్తులు ఆదివారం ఉదయంనుండి గ్యాలరీల్లోకి చేరుకున్న తరువాత నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, కాఫీ పంపిణ చేసేలా చూస్తారు. ఒకేరోజు ఏడు వాహనాలు మాఢవీధుల్లో ఊరేగింపు ఉండటంతో పటిష్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారు అధిరోహించే వాహనాలను మోసేందుకు తండ్లు మరమ్మతులు చేపట్టారు.

## 26నుండి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు


(ఫైల్‌పోటో)

తిరుపతి, జనవరి 20(ప్రభాతవార్త): తిరుపతి గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాలు ఈనెల 28వతేదీ నుండి ఫిబ్రవరి 1వరకు జరగనున్నాయి. ఏడురోజుల పాటు సాయంత్రం 6.30 గంటల నుండి 8గంటల వరకు స్వామివారు దేవేరులతో కలసి గోవిందరాజస్వామి పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తారు. ఆ తరువాత ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. తొలిరోజు 26వతేదీ కోదండరామస్వామి, 27న రుక్మిణీసత్యభామసమేత పార్థసారధి, 28న శ్రీదేవిభూదేవిసమేత కల్యాణవేంకటేశ్వరస్వామి, 29న ఆంగాళ్ అమ్మవారితో కలసి శ్రీకృష్ణస్వామి, 30న, 31, ఫిబ్రవరి 1తేదీల్లో అమ్మవార్లతో గోవిందరాజస్వామి తెప్పలపై భక్తులకు కనువిందుచేయనున్నారు. చివరిరోజు తెప్పోత్సవం అనంతరం ఎదురు ఆంజనేయస్వామి సన్నిధికి స్వామి వేంచేపుచేస్తారు.

# అమరవీరుడు కార్తీక్ విగ్రహావిష్కరణ

### జవాన్ సేవలను కొనియాడిన కలెక్టర్, ఎమ్మెల్యే


వీర జవాన్ కార్తీక్ విగ్రహం వద్ద వందనం చేస్తున్న కలెక్టర్

బంగారుపాళ్యం, జనవరి 20 ప్రభాతవార్త: గత ఏడాది జనవరి 25న నార్త్ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో జవాన్ కార్తీక్ యాదవ్ అమరుడయ్యాడు. మండలంలోని రాగిమానుపెంట గ్రామంకు చెందిన వరదరాజులు, సెల్వి రెండవ కుమారుడు దేశ సైన్యంలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కొల్పోయాడు. అతని ప్రాణ త్యాగానికి స్ఫూర్తిగా అమర జవాన్ ట్రస్ట్ కార్తీక్ విగ్రహంను బంగారుపాళ్యంలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహంను కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. అంతకు ముందు బంగారుపాళ్యంలో విద్యార్థులు, మాజీ సైనికులు, తెలుగుదేశం నాయకులు, ప్రజలు జాతీయ జెండాలు చేపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక్ ధైర్య సాహసాలను కొనియాడారు. దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన కార్తీక్ మన మధ్య పుట్టడం గర్వకారణమన్నారు. కార్తీక్ కుటుంబానికి ప్రతి ఒక్కరు అండగా వుండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కార్తీక్ కుటుంబానికి ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో కార్తీక్ గుడి కట్టుకున్నాడన్నారు. భరతమాత రక్షణ కోసం దేనికైనా సిద్ధం అంటూ పోరాడిన కార్తీక్ వీరమరణం పొందారన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ జయచంద్రనాయుడు, మండల టిడిపి గౌరవ అధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, పార్టీ మండల కార్యదర్శి జనార్ధన్‌గౌడు, నాయకులు కోదండయాదవ్, నాగరాజు, లోకనాథనాయుడు, కోకా ప్రకాష్, కమలనాథరెడ్డి, బాలకృష్ణమనాయుడు, రాధాకృష్ణ, తహసిల్దారు షబ్బీర్ భాషా, సర్పంచ్‌లు తోట శ్రీహరి, ఉమాదేవి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. చివరిగా అమరులైన వీర జవాన్ తల్లిదండ్రులు సెల్వి, దేవరాజులును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఇతర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఇందులో అమర జవాన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మామిడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో సైనికుల పాత్ర కీలకం

### - జాతీయ సైనిక దినోత్సవంలో ఎస్పీ తుషార్ దూడి



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త: పోలీసులు లా అండ్ అర్డర్‌ను కాపాడటానికి కష్టపడితే దేశ రక్షణలో సైనికులు అంత కంటే ఎక్కువ కష్టపడుతారని ఎస్పీ తుషార్ దూడి అన్నారు. 78వ జాతీయ సైనిక దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం గ్లోబల్ పీస్ అసోసియేషన్ శ్రీనివాసం మోడరన్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ తుషార్ దూడి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ 2025లో జమ్మూలో టెర్రరిస్టుల దాడిలో ప్రాణాలు కొల్పోయిన పంగల కార్తీక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ తన తాత సైన్యంలో కెప్టెన్‌గా పదవి విరమణ చెందారని, 1971లో లొంగేవాలా యుద్ధంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారన్నారు. ప్రస్తుతం మనమందరం ఇక్కడ కూర్చొని సంతోషంగా నవ్వుతూ మాట్లాడుతున్నామంటే సైనికుల వల్లే అన్నారు. సైనికులు వాతావరణ పరిస్థితులు క్లిష్టంగా వున్నప్పటికీ వాటిని తట్టుకుని దేశానికి పహారా కాస్తుంటారన్నారు. మనం సైనికులు కాకపోయినా మన కర్తవ్యాలు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, పిల్లలకు దేశం, సైనికుల గురించి తెలిపి క్రమశిక్షణను అలవాటు చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ఉగ్రవాదులతో పోరాడి ప్రాణాలు అర్పించిన సైనికుల గురించి పిల్లలకు తెలియజేయాలని, వారి వీరత్వంను ప్రేరణగా తీసుకుని మన పిల్లలను సైన్యం, పోలీసులుగా తీర్చిదిద్దడానికి ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ దూడిని గ్లోబల్ పీస్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసం, మోడరన్ స్కూల్ యాజమాన్యం, ఎన్‌సిసి విద్యార్థులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ పీస్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసం, మోడరన్ స్కూల్ యాజమాన్యం, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ పంగల కార్తీక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ

# మరింత డ్రోన్ నిఘా

### నగరి సబ్ డివిజన్ పోలీసులకు

### 7 కొత్త డ్రోన్లు అందజేసిన ఎస్పీ

చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:


నగరి సబ్ డివిజన్ పోలీసులకు అందించే డ్రోన్ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ దూడి.

జిల్లాను డ్రోన్ భద్రతా వలయంలోకి తీసుకురావడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పక్కాగా శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎస్పీ తుషార్ దూడి చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో నగరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు మంగళవారం కొత్తగా 7 డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ దూడి మాట్లాడుతూ నగరి సబ్ డివిజన్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాలు, రద్దీ ప్రాంతాలు, నేరాలకు అవకాశం వున్న ప్రదేశాలు, అక్రమ రవాణా మార్గాలు, ప్రజా కార్యక్రమాలు, ఉత్సవాలు, సమావేశాలు వంటి సందర్భాల్లో డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు నిఘా నిర్వహించి ప్రజా భద్రతను మరింత పటిష్టం చేస్తున్నామన్నారు.

**డ్రోన్ల సమాచారంతో మద్యం సేవిస్తున్న ఇద్దరిని పట్టుకున్న పోలీసులు**

చిత్తూరులో డ్రోన్ నిఘాతో బుధవారం బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులుపోలీసులు పట్టుకున్నారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మాట్లాడుతూ చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల వెనుకవైపు బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరిని డ్రోన్ కెమెరాలు గుర్తించాయన్నారు. సత్వరం సంఘటనా స్థలంకు పోలీసులు చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులుగా చేసి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడటం చట్టవిరుద్ధమని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### మత్స్యకారుల సమస్యలను

# పార్లమెంటు వేదికగా ప్రశ్నిస్తా

### - ఎంపీ మద్దెల గురుమూర్తి



వెంకటగిరి, జనవరి 20, ప్రభాతవార్త జిల్లా పులికాట్ ప్రాంతంలో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర జల వివాదం సమస్య గురించి స్థానిక మత్స్యకారులు తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని సుమారు 24 గ్రామాల మత్స్యకారులకు పులికాట్ సరస్సు, దాని పరిసర తీర ప్రాంతాల్లో చేపల వేటే ప్రధాన జీవనాధారమని, అందులో ఐదు గ్రామాలు పూర్తిగా మత్స్యవృత్తిపైనే ఆధారపడి ఉన్నాయని వారు ఎంపీకి వివరించారు. పన్నంగాడు ప్రాంతంలో ఉన్న పులికాట్ సరస్సు పబ్లిక్ పులికాట్ మ్యాప్స్ ప్రకారం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోనే ఉందని, ఈ ప్రాంతం అంతర్రాష్ట్ర సరిహద్దుకు సుమారు 3.34 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు సరిహద్దులు మార్చేశారని అందువలన చేపల వేట కొనసాగించడం సమస్యగా మారిందని మత్స్యకారులు తెలిపారు. దీనివల్ల తరచు ఘర్షణలు చోటుచేసుకుంటూ, స్థానిక మత్స్యకారులు భయభ్రాంతులకు గురవుతూ జీవనాధారం కోల్పోయే పరిస్థితి నెలకొందని ఎంపీకి తెలియజేశారు. ఈ అంశం గురించి వారితో మాట్లాడిన ఎంపీ గతంలో పార్లమెంటు సమావేశాలలో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. మరోసారి పార్లమెంటులో ప్రస్తావిస్తానని వారికి తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడిన ఎంపీ గురుమూర్తి అక్రమ చొరబాట్లను అరికట్టి స్థానిక మత్స్యకారులకు రక్షణ కల్పించాలని, వారి హక్కులను కాపాడేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

# సిఎం పర్యటన విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే, కలెక్టర్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పుత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త : నగరి పట్టణంలో ఈ నెల 24వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సిఎం పర్యటన నేపథ్యంలో మంగళ వారం నగరి పట్టణంలో పలు ప్రదేశాలను వీరు పరిశీలించారు. నగరి మునిసిపాలిటీలో జరిగే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి ఎమ్మెల్యే, కలెక్టర్ పట్టణంలోని సంబంధిత అధికారులతో కలిసి జూనియర్ కాలేజీ గ్రౌండ్, డిగ్రీ కాలేజీ గ్రౌండ్, హెలీ ప్యాడ్ ప్రాంతం, సభా స్థలం, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించే చింతలపట్టెడ లోని 28, 29 వార్డుల్లోని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రజలు సులభంగా సభా స్థలికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు భోజనవసతి, మంచినీరు, పార్కింగ్‌తో పాటు ఇతర ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# హెచ్‌ఐవి ఉన్నవారిపై వివక్ష నేరం - గోప్యత హక్కు తప్పనిసరి

### రాష్ట్ర శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్‌పర్సన్ తోట త్రిమూర్తులు




తిరుపతి కలెక్టరేట్, జనవరి, 20 ప్రభాతవార్త : ప్రజారోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్‌పర్సన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన జీవో లు 85, 127, 311 అమలుపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ఆయన దిశ నిర్దేశం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఆయన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, అసిస్టెంట్ సెక్రటరీ, కమిటీ ఇంచార్జ్ విశ్వనాథం, అప్సక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వ ఉత్తర్వుల ఉద్దేశ్యాలు, అమలు విధానం, ప్రస్తుత స్థితి, ఎదురవుతున్న సమస్యలు మరియు భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. హెచ్‌ఐవి తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఆరోగ్య సంరక్షణ, నివాసం (గృహం), ఉపాధి, విద్య మరియు బీమా రంగాల్లో వివక్ష చూపించడం చట్టరీత్యా నేరమని సంబంధిత అధికారులు తెలిపారు. ఇటువంటి వివక్షకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ శాసనసభ్యులు పీలేరు, సింగనమల నగిరి, సత్తెనపల్లి, కావలి కిషోర్ కుమార్ రెడ్డి, శ్రావణి గాలి భాను ప్రకాష్, కన్నా లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డిఎంఈ రఘునందన్, డిపిహెచ్ అండ్ ఎఫ్ డబ్ల్యు డా పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, డి ఎం అండ్ హెచ్ వో బాలకృష్ణ నాయక్ స్విమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ శైలజ, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, శ్రీ పద్మావతి మహిళా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉష కళావత్, రిజిస్టర్ అపర్ణ, డిప్యూటీ రిజిస్టర్ రెడ్డి, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలు అంతా ఖాళీలే

### సత్యవేడు మండలంలో ఇది సంగతి...


సచివాయలంలో సిబ్బంది, అధికారులు లేక ఖాళీ కుర్చీలు

సత్యవేడు, జనవరి 20 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో సాధారణంగా ప్రతిసోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా సిబ్బంది, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి ప్రజా ఫిర్యాదులు స్వీకరించాలి...అయితే ఆ తంతును కొందరు పూర్తిగా విస్మరించి కుంటిసాకులతో కార్యాలయాల వైపే కన్నెత్తి చూడడం లేదు. ఇందుకు ఉదాహరణ సత్యవేడు మేజర్ పంచాయతీ కార్యాలయంకు పక్కనే ఉన్న రెండు, మూడు సచివాలయాల్లో ఏ ఒక్క సిబ్బంది లేరు. ఒకరిద్దరు అక్కడ కూర్చుని ఉన్నారు. వారిని ప్రశ్నిస్తే వర్క్ ఫ్రం హోం ఆన్‌లైన్‌లో పని చేస్తున్నాం. మేము సచివాలయ సిబ్బంది కాదు అని చెప్పడం జరిగింది. సిబ్బంది విషయాన్ని ప్రశ్నిస్తే అందరూ సర్వేకు వెళ్లారు...మేమేం చేసిది...సర్వే పనులు కూడా జరగాలి కదా పై అధికారుల నుంచి ఒత్తిడి అంటూ ఈ సచివాలయ పర్యవేక్షణ అధికారి రవికుమార్ వెల్లడించారు. ల్యాండ్ సర్వేకు సర్వేయర్లు, వీఆర్వో మాత్రమే వెళ్లాలి. మిగిలిన సిబ్బంది విషయం అంతు చిక్కడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సమస్యలు చుట్టూ ముడుతున్నాయని, కనీసం సచివాలయాల్లో వివిధ పనుల కోసం వెళ్లే వారికి దరఖాస్తులు ఇచ్చే దిక్కు కూడా లేదు. ఇక్కడికి ఎవరు వస్తారు..ఎవరు చూస్తారు...అని ధీమాతో సిబ్బంది వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

### సమగ్ర పంటల ఆరోగ్య యాజమాన్యం అంశంపై

# పరిశోధనలు కొనసాగాలి

### ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి



తిరుపతి విద్య, జనవరి 20 ప్రభాతవార్త ఎస్‌వి వ్యవసాయ కళాశాలలో తెగుళ్ల శాస్త్ర విభాగము ఇండియన్ ఫైటో పాథలాజికల్ సొసైటీ, సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైంటిస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు, సింపోసియం వ్యవసాయ కళాశాల తిరుపతిలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అధిక దిగుబడుల కోసం సాగుతున్నటువంటి వ్యవసాయ విధానాలలో తెగుళ్ల తీవ్రత సమస్య పెను సవాలుగా మారిందన్నారు. అనంతరం గౌరవ అతిథిగా విచ్చేసిన వియత్నాం దేశ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గుయన్ డాక్ కోవా మాట్లాడుతూ సాగు పద్ధతులలో గణనీయమైన మార్పులు రావడం వలన వివిధ పంటలలో తెగుళ్ల తీవ్రత పెరుగుతోందని, దీనిని నివారించడానికి భారతదేశంలోని వ్యవసాయ పరిశోధన సంస్థలతో కలిసి పని చేస్తామని తెలిపారు తర్వాత ఇండియన్ ఫైటో పెథాలాజికల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ వివిధ వ్యవసాయ శాస్త్ర విభాగాల సమన్వయంతో పరిశోధనలు జరపడం ద్వారా పంటల ఆరోగ్య యాజమాన్యంను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం కృష్ణారెడ్డి, డాక్టర్ సిలియా చలం షిమోగా, వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎంకే నాయక్, వ్యవసాయ వర్సిటీ డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏ వి రమణ, వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ జి శివ నారాయణ, వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్, ఏడిఆర్ డాక్టర్ వి.సుమతి, సదస్సు ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంకే జ్యోత్స్న, సెక్రటరీ డాక్టర్ ప్రదీప్ మన్యం, కళాశాల తెగుళ్ల శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వేమన, వివిధ రాష్ట్రాల నుంచి వ్యవసాయశాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛకుప్పం సాధనకు సహకరించాలి: కడ పి.డి.



**కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛకుప్పం సాధనకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మ ంగళవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో స్వచ్ఛతపై కలసి నడుద్దాం రండి పేరిట కార్యక్రమాన్ని స్థానిక కడ కార్యాలయం వద్ద నుంచి పాత మార్కెట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే కుప్పం మున్సిపాలిటీలో పగలు, రాత్రి రెండుపూటల పారిశుధ్య పనులు చేయించడంతో పాటు ఇంటింటినుంచి చెత్తసేకరణ జరుగుతోందన్నారు. ప్రజలు కూడా రోడ్లపై చెత్త చెదారాలు పడేయరాదని సూచించారు. స్వచ్ఛకుప్పంలోభాగంగా ఈసారి జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు కుప్పంకు వచ్చేలా ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులు సహకరించాలని కోరారు. కడ సభ్యులు రాజ్‌కుమార , రామచంద్ర, సతీష్, కౌన్సిలర్ సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు తులసినాథ్, శివతేవర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ గంగమ్మగుడి ఛైర్మన్ సతీష్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



**కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని పాతపేట, కొత్తపేట లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహిం చారు.అమ్మవారికి ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో అమ్మవారి ఆత్మార్పణ ఘట్టాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్యులు, స్థానిక ప్రముఖులు అమ్మవారిని దర్శించుకు న్నారు. కార్యక్రమంలోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **రామకుప్పం :** మండలంలోని ఆనిగానూరు, రామకుప్పంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులుభక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నేతలు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ల చొరవతో పారిశుద్ధ్య పనులు

**కుప్పం, జనవరి20ప్రభాతవార్త** స్థానిక 18,19వ వార్డుల్లో కౌన్సిలర్లు చొరవ చూపి దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయించారు. కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్‌లు స్థానిక ప్యాలస్ రోడ్డు, డికెపల్లి రోడ్డు ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులద్వారా కాలువలను శుభ్రం చేయించారు.

# రాజుపేటలో ఘనంగా పశువుల పండగ

రామకుప్పం, జనవరి 20 ప్రభాతవార్త



మండలంలోని రాజుపేట గ్రామంలో మంగళ వారం గ్రామస్తులు పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి రంగు రంగులతో వాటిని అలంకరించారు. గ ంగమ్మ ఆలయం వద్దవిశేష పూజల అనంతరం వాటిని ప్రదరి ్శంచారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి యువత, మహిళలు ఈ ప్రదర్శన తిలకించేందుకు హాజరయ్యారు.

# తోట్లచెరువులో ఘనంగా తెప్పోత్సవం

రామకుప్పం, జనవరి 20 ప్రభాతవార్త



మండలంలోని కెంచనబళ్లగ్రామంలోని తోట్ల చెరువులో గ్రామస్తులు తెప్పోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఇటీవల కృష్ణాజలాలతో చెరువు పూర్తిగా నిండి మరువ వెళ్ ్తంది. దీంతోబళ్ల గ్రామస్తులు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం జలకళతో నిండిన చెరువులో తెప్పోత్సవంను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి ప్రజలుఈ కార్యక్రమంకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ, నేతలు వెంకటరమణ, ఆనందరెడ్డి,ఆంజనేయరెడ్డి, కామరాజునాయక్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, సత్యేంద్రశేఖర్, రామూర్తి, కృష్ణానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి,సత్తి, జయశంకర్, శంకరాచలం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# సీజ్ చేసిన వాహనాల వేలం

బైరెడ్డిపల్లి,జనవరి 20 ప్రభాతవార్త

మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 22వతేది బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై చందనప్రియ తెలిపారు. మూడు కార్లు, ఏడు టువీలర్లను పలమనేరు రూరల్ సిఐ అధ్వర్యంలో గంగవరం పిఎస్‌లో వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ఈనెల 22వతేదిఉదయం10గంటల్లోపుగంగవరంమండలపోలీస్‌స్టేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాల న్నారు.

# నిర్లక్ష్యం లేకుండా పేషెంట్ల ఎగ్జామినేషన్

– ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్

***చిత్తూరుహెల్త్, జనవరి 20 ప్రభాతవార్త:*** వైద్య విద్యార్థులు పేషంట్ ఎగ్జామినేషన్‌ను శ్రద్ధతో శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ అన్నారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఏఐఎంఎస్ఆర్) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్లినికల్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లీనికల్ కేసులపై రూట్ క్రాస్ అనాలసిస్ నిర్వహించి, సంబంధిత అన్ని విభాగాల అభిప్రాయాలను సమన్వయంతో పరిశీలించినపుడే సరైన నిర్ధారణ సాధ్యమవుతుందన్నారు. క్లినికల్ మీటింగ్‌ల ద్వారా విద్యార్థుల్లో ప్రాయోగిక నైపుణ్యాలు, బాధ్యతాయుత వైద్య ధోరణి, మెడికో-లీగల్ అవగాహన మరింత పెరుగుతుందని ఆమె అభిప్రా యపడ్డారు. లెన్స్ డ్రివెన్ క్రైసిస్ నొప్పి ఒత్తిడి దృష్టి ప్రభావం అనే అంశంపై పీజీ విద్యార్థిని గాయత్రి మాట్లాడుతూ లెన్స్‌కు సంబంధించిన సమస్యల వల్ల కంటి నొప్పి, కంటి ఒత్తిడి పెరగడం, దృష్టి దెబ్బతినే పరిస్థితులను క్లినికల్ కేసుల ఆధారంగా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విభాగాధిపతులు, ఎంబిబిఎస్ విద్యార్థులు, పిజీ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం

**పాకాల, జనవరి 20, ప్రభాతవార్త** పాకాల మండలం కావలివారిపల్లి గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భస్థ సమస్యలు కలిగిన 7 పశువులకు వైద్య సేవలు, చిన్న దూడలలో నులిపురుగుల నివారణకు 27 దూడలకు మందులు వేశారు. 83 పశువులకు కడుపు మందులు ఇవ్వడం పిడుదులు, గోమార్ల నివారణ చర్యలలో భాగంగా 110 పశువులకు పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగిల్ విండో ఛైర్పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి, గ్రామ సర్పంచ్ చంగల్ రాయలు, డాక్టర్ శీధర్, పాకాల మండలం పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ పరీష్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాసవి మాతకు ప్రత్యేక పూజలు



**కల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త** పులిచెర్ల మండలంలోని కల్లూరులో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం వాసవి మాత ఆత్మర్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయంహోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

# రోడ్ల విస్తరణ పనులు ముమ్మరం

***చిత్తూరుహెల్త్, జనవరి 20 ప్రభాతవార్త:*** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు ముమ్మరం అయ్యాయి. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు వున్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమంను మంగళవారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో చేపట్టారు. పలమనేరు రోడ్డులో భవన యాజమానులను ఒప్పించి రోడ్డు విస్తరణకు అడ్డంగా వున్న వారి సొంత భవనాలను మున్సిపల్ అధికారులు తొలగింపుకు శ్రీకారం చుట్టారు.

# జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త: జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆదర్శ్ రాజేంద్రన్ స్వస్థలం కేరళ. గతంలో ఆదర్శ్ రాజేంద్ర నూజివీడు సబ్ కలెక్టర్, ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ సిఇఓ, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదర్శ్ రాజేంద్రన్‌ను ప్రభుత్వం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం జాయింట్ కలెక్టర్‌గా ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్క జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విద్యాధరిని ప్రభుత్వం విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. నూతనంగా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ్ రాజేంద్రన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# పక్కాగా రహదారి నిబంధనలు అమలు

– అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడెల్

**చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:**

రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరు పక్కాగా పాటించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడెల్ అన్నారు. ఆర్‌టిఓ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడెల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదం ఎటువైపు నుండి వస్తుందో తెలియని పరిస్థితులు వుండటంతో హెల్మెట్ విషయంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మోటర్ వాహన నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారి డ్రైవింగ్ లైసెన్సులను 3 నెలల పాటు విధిగా రద్దు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 379 రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో 160 ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో జరిగినవి అన్నారు. రహదారి భద్రత మనందరి బాధ్యతగా జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కలసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్టీఓ సునీల్‌కుమార్,ఎంవిఐలు నరసింహులు, రాజేశ్వరరావు, మురళీ, ఎన్జీఓలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సిఎం చొరవతో శ్రీవారిఉచిత దర్శనం

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు చొరవతో దివ్యాంగులకు తిరుమల శ్రీవారి ఉచిత దర్శనం కల్పించడం జరుగుతోందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలో చుక్కల చారిటబుల్ ట్రస్ట్, టిటిడి అధికారుల అధ్వర్యంలో 11వ దివ్యాంగ జనసేవ యాత్ర కార్యక్రమంలో భాగంగా కుప్పం నుంచి 37మంది దివ్యాంగ భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించుటకు ప్రత్యేక బస్సును వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యా ంగులకు చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఛైర్మన్ డా॥ వేణు శ్రీవారి దర్శనాలను కల్పిస్తు ండడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ అనిల్ సింఘాల్, ఎఇఒ వెంకయ్య చౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



***కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త*** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో చేపట్టే పశుభీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు కోరారు. రూ 15వేలనుంచి 1లక్ష దాకా పశువుకు భీమా చేసే అవకాశం ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ భరిస్తుందన్నారు. ఒక కుటుంబంకు గరిష్టంగా పది పశువులకు భీమా చేయించుకోవచ్చన్నారు. ఇది మూడేళ్ల దాకా వర్తిస్తుందన్నారు. పశువులకుచెవిపోగు వేయించి భీమాలో నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ నాటు పశువులకు రూ 816, మేలుజాతి పశువులకు రూ 1632మాత్రం వర్తిస్తుందన్నారు. రైతులు వివరాలకు రైతు సేవా కేం ద్రంలో లేదా పశువైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు సైతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాడి పశువులకు అవసరమైన మందులు ఉచితంగాఅందిస్తున్నట్లు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభం



కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తే రైతులకు ఎంతో లాభదాయకమని నోడల్ అధికారి బాజీబాబు, డిపిఎం అమృతవల్లి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఐసిఆర్‌పిలకు ఆరో విడత శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణలో భాగంగారెండు రోజులు క్షేత్రస్థాయిలో శిక్షణకల్పించినట్లు చెప్పారు. తక్కువ నీటి వినియోగం, రసాయనిక ఎరువుల వాడకం లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయవచ్చన్నారు. తక్కువ నీటి వినియోగంతోనే పంటలు అధిక దిగుబడి వస్తాయన్నారు. రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై మరింత దృష్టి సారించాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తగు ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# డ్రోన్‌ల సహాయంతో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

– సిసి కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు

– జిల్లా నేర సమీక్షలో ఎస్పీ తుషార్ డూడి



**చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:** డ్రోన్‌ల సహాయంతో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎస్పీ తుషార్ డూడి ఎఎస్పీలు, డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఎస్పీ తుషార్ డూడి పోలీసింగ్ స్కిల్స్, విజిబులల్ పోలీసింగ్ పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో సఖ్యతగా వుంటూ చట్టాలపై గౌరవం పెంచేలా మెలగాలని, అక్రమ రవాణా నేరస్తులపై ఉక్కుపాదం మోపాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే సిసిటిఎన్ఎస్ డేటాను సత్వరం నవీకరిస్తూ, ప్రతి మార్పును డేటాలో వెంటనే నమోదు చేసి అప్డేట్ చేయాలన్నారు. క్రైమ్, క్రిమినల్ వివరాలను సిసిటిఎన్ఎస్‌లో నిరంతరం నవీకరించాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవడం వంటి విభిన్న దశల్లో డ్రోన్లు ఉపయోగపడుతాయన్నారు. ఎక్కడైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి నేరస్తులు వదలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరా ఫుటేజీలను క్రోడీకరించి నిందితులను పట్టుకుని వారి నుండి దొంగలించబడిన పూర్తి మొత్తంను రికవరీ చేయాలన్నారు. ప్రజలు అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చే సంక్షిప్త సమాచారం, మెయిల్స్‌లోని లింకులు ఓపెన్ చేయకుండా తిరస్కరించాలన్నారు. లింక్‌లను క్లిక్ చేస్తే బ్యాంకుల్లోని నగదు మొత్తం మాయం అయ్యే అవకాశం వుంటుందని, యాప్‌ల ద్వారా రుణం ఇస్తామని ఫోన్ చేసిన వాటిని తీసుకోకూడదన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా వుండాలని, పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జి అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# హైందవ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



**చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త** హైందవ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యతని పురాతన దేవాలయాల హరిహర హనుమదీశ్వర అయ్యప్ప సాయిరాం చారి టబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కె.వెంకట్ర మణారెడ్డి అన్నారు. ఎ.కొత్తకోట సమీపంలోని అగస్తీ శ్వరస్వామిని ఆయన దర్శించుకొన్నారు. పుంగనూరు నానాసాబ్‌పేటకు చెందిన ఓంశక్తి భక్తులకు ఇరుముడులు చెల్లించుకొనే క్రమంలో దారి ఖర్చులకు రూ. 50వేల వరకు వారికి సాయమందించారు. టిటిడి వారి శ్రీవాణీ ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణానికి రూ. 15నుంచి 30లక్షల వరకు మంజూరు చేస్తారన్నారు. ఇలాంటి వెసులుబాటు ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. సాధారణంగా టిటిడివారు వైష్ణవాలయాలకు మాత్రమే నిధులు కేటాయిస్తారనీ, అయితే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో అన్ని దేవాలయాలకు నిధులు కేటాయించడం ఇదే ప్రథమమన్నారు. అధిష్టానం ఆదేశిస్తే నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలకు మహర్దశ వస్తుందనీ, పేద, మధ్యతరగతి కుటుంబాలు వున్న చోట్లలో నూతనంగా ఆలయ నిర్మాణాలు చేపడతానన్నారు. అదే విధంగా బోయకొండ గంగమ్మ ఆలయాన్ని చరిత్రలో నిలుపుతామన్నారు. అనంతరం క్యాలండర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి జల్లి మనోహర్, బల్లాపురం నరేష్, జనసేన నాయకుడు హరినాథ్, ఎన్ఎస్‌పేట ఓంశక్తి భక్తజనమండలి, స్థానికులు పాల్గొన్నారు

# వైశ్య వంశాబ్ది సుకుమార వనజం

–వాసవీమాతా ఆత్మార్పణం



**చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త** వైశ్యకుల పరిరక్షణకే శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణం చేసుకొందని ఆర్యవైశ్యులన్నారు. వాసవీమాత 2506వ ఆత్మార్పాణా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్యు లందరూ ఉదయాన్నే అమ్మవారికి ఇంటింటి నుంచి పాలను తెచ్చి క్షీరాభిషేకం చేసారు. వేదపండితుల ఆధ్వర్యంలో కలశస్థాపన, హోమాధి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యంగా మహిళలు సాయంత్రం వరకు పలు రకాల పూజలతో అమ్మవారిని ఆరాధించారు. కుసుమశ్రేష్టి పుత్రికగా జన్మించి ఆర్యవైశ్యకుల రక్షకురాలుగా ఆత్మార్పణం చేసుకొన్నారంటూ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ సేవా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# 108అంబులెన్స్‌లో డ్రైవర్ల పోస్టుకు ధరఖాస్తు ఆహ్వానం

**చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త** 108అంబులెన్స్‌లో డ్రైవర్ల పోస్టుకు ధరఖాస్తు చేసుకోవాలని 108జిల్లా మేనేజర్ మోహన్‌బాబు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జగదీష్, మనోజ్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదివి, హెవీలైసెన్స్, బ్యాడ్జి కల్గిన, 35ఏళ్ళలోపు వ్యక్తులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 22, 23న తిరుపతి డిఎంహెచ్‌ఓ కార్యాలయం, పాత మెటర్నరీ ఆసుపత్రి, అలిపిరి రోడ్డులో జరిగే ఇంటర్వ్యూకు హాజర కావాలన్నారు.

# భయానికి ముగింపు భద్రతకు ఆరంభం :సిఐ



**పూతలపట్టు, జనవరి 20 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడి వారి ఆలోచన మేరకు చిత్తూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సాయినాథ్ పర్యవేక్షణలో పూతలపట్టు సీఐ డి.గోపి మండల ప్రజల భద్రతే ముఖ్యంగా భావించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా మండల ప్రజలకు ధైర్యాన్ని నింపుతున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఆరు గంటలు తర్వాత బయట మద్యం తాగడం ప్రజలు వచ్చిపోయే దారిలో ఈవ్ టీజింగ్ మొదలగు నేరాలకు పాల్పడడం, సరియైన లైటింగ్ లేకపోవడం వల్ల చీకటిగా ఉంది ప్రజలు అటువైపు వెళ్లడానికి భయానకంగా ఉండే సందర్భాలు, జూదము, డ్రగ్స్ వంటి కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను ఎన్నుకొని ఆ ప్రాంతంలో ముందు ఏ విధంగా అయితే ప్రజలు ఆ ప్రాంతాన్ని చూసి భయపడేవారు అటువంటి భయాన్ని తొలగించే విధంగా ధైర్య స్పర్శ అనే కార్యక్రమం భయానికి ముగింపు భద్రతకు ఆరంభం అనే శీర్షికన కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పూతలపట్టు మండలం ఎస్వి ఇంజనీరింగ్ కాలేజ్‌కు పక్కన గల రైల్వే అండర్ బ్రిడ్జిను క్రైమ్ హాట్స్పాట్‌గా గుర్తించి అక్కడ ఉన్నటువంటి మద్యం వ్యర్థాలను తొలగించి మట్టిదిబ్బలను చదును చేసి ప్రజలకు రాకపోలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా అక్కడ పోలీసు భద్రత ఉన్నది అని తెలిపే విధంగా పెయింటింగ్ బోర్డులు, సీసీ కెమెరాలు లైటింగ్ ఏర్పాటు చేసారు. పోలీసు చర్యలను ప్రజలందరూ స్వాగతిస్తూ పోలీసులకు జేజేలు పలుకుతున్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

# ప్రతిరైతు విధిగా ఈ పంటలో నమోదు చేసుకోవాలి



**పెనగలూరు, జనవరి 20 ప్రభాతవార్త** రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం లోని వెలగచెర్ల, సిరివరం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి అధ్వ ర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం మాట్లాడు తూ మన మండలంలో ఈ రబీ సీజన్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు సాగుచేస్తున్నారు. కాబట్టి పంటలు వేసిన ప్రతి రైతు విధిగా సంబంధిత రైతుసేవా కేంద్రాల సిబ్బందిని కలిసి మీ సాగు వివరాలు ఇచ్చి ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో నవంబర్ నుండి ఇప్పటివరకు దాదాపుగా 125 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారన్నారు. అలాగే ఇంకా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేసుకొని రైతులు వుంటే వారు వెంటనే సంబంధిత రైతుసేవ కేంద్రాల సిబ్బందిని కలిసి ఫార్మర్ రిజిస్ట్రీ యాప్ నందు నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకొని రైతులకు పీఎంకిసాన్ డబ్బులు రూ. 2000 మీ అకౌంట్ నందు జమ చేయడం జరగదని తెలిపారు.రైతు సేవా కేంద్రాల సిబ్బంది మల్లికా, సుధ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శైలజ, అమరేంద్ర రైతులు పాల్గొన్నారు..

# ఘనంగా పరమేశ్వరి దేవి ఆత్మర్పణ దినోత్సవం



**రైల్వేకోడూరు, జనవరి 20 ప్రభాతవార్త** రైల్వే కోడూరు పట్టణం లోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవి ఆత్మర్పణా దినోత్సవాన్ని అమ్మవారి శాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలొ ్గన్న ఆర్యవైశ్యులు ఘనంగా అమ్మవారి పూజలో పాల్గొని వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రసాదాలను అందజేశారు. మొట్టమొదటిసారిగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పెండ్యాల విజయకుమార్ చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కలువ మురళి, కోశాధికారి, పెదబల్లె సుబ్బారావు మరియు సంఘ సభ్యులు దేవస్థాన కమిటీ,మహిళా మండలి, యువజన సంఘం, ఆర్యవైశ్య సమాజం, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# నేడు టిడిపి తీర్థం పుచ్చుకోబోతున్న కేఆర్‌కండ్రిగ మాజీ సర్పంచ్



**ఓబులవారిపల్లి, జనవరి 20 ప్రభాతవార్త** ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి ఆధ్వర్యంలో జియ్యవరం పంచాయతీ కేఆర్ కండ్రిక గ్రామ మాజీ సర్పంచ్ ముద్దనూరు చంద్రరాజు నేడు తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అభివృద్ధి సంక్షేమం ప్రజా పాలన దిశగా పార్టీ బలోపే తానికి ఈ చారిత్రక ఘట్టంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ అభిప్రాయానికి దిగారని అంచెలంచలుగా ప్రజాభివృద్ధి జరగడంతో రూపానంద రెడ్డి నాయకత్వం విశ్వాసానికి మారుపేరుగా ఉందని ఆ పార్టీకి తీర్థం పుచ్చుకుంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఒక ప్రకటనలో టిడిపి వర్గీయులు కోరారు.

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**రైల్వేకోడూరు, జనవరి 20 ప్రభాతవార్త** రైల్వే కోడూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం తిరుపతి జిల్లా విజిలెన్స్ ఎస్పి కరిముల్లా షరీఫ్, ఆదేశాల మేరకు రైల్వే కోడూరు మండలంలోని ఎరువులు మరియు పురుగుమందుల డీలర్ షాపులపై తిరుపతి విజిలెన్స్ రామాంజనేయ రెడ్డి కోడూరు వ్యవసాయ అధికారి వెంకటాద్రిలు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో స్టాకు రిజిస్టర్స్, బిల్లు బుక్కులు గోడంలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ పురుగుమందుల దుకాణాలపై తనిఖీ చేసి కచ్చితంగా స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేయాలని ధరలు పట్టిక షాపులో ఉంచవలసిందిగా ఆదేశించారు. ఫారం వో, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్, ప్రొడక్ట్స్‌కు ఉండాలని లేని పక్షంలో షాపు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జడ్పీ హైస్కూల్‌కు నీటి శుద్ధి యంత్రం వితరణ



**పుల్లంపేట, జనవరి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం మీకోసం మేమున్నాం అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు నీటి శుద్ధి యంత్రమును ఉచితంగా బహుకరించారు. గతంలో ఈ పాఠశాలకు ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన నీటిశుద్ధి యంత్రం చెడిపోవడంతో స్థానికులు మీకోసం మేమున్నాం స్వచ్ఛంద సంస్థ సభ్యులకు తెలపగా వారు నీటి శుద్ధి యంత్రం వితరణ చేశారు.

# పాఠశాల అభివృద్ధికి సహకరించండి



**పాలసముద్రం, జనవరి 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎస్.ఆర్.కండ్రిగ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం చిత్తూరు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యదర్శి ఎం.వాసు నాయుడు ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన వాసు నాయుడు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నా వంతుగాప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండాపాఠశాలఅభివృద్ధికి తోడ్పడతానని వారి కి హామీ ఇచ్చాడు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే తమ ప్రధాన లక్ష ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విశ్రాంతి ఉపాధ్యాయులు ఏలుమలై పాల్గొన్నారు.

# ఎరుకల అధ్యక్షుడుకి సన్మానం

**పుంగనూరు జనవరి 20 ప్రభాతవార్త**



పట్టణ ఎరుకల సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట బాబును మంగళవారం ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం,ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు సన్మానిం చారు. ఏపీ రాష్ట్ర దళిత సంఘం అధ్యక్షులు ఎం శంకరప్ప మాట్లాడుతూ ఇంతవరకు. పుంగనూరులో ఏర్పడిన ఎరుకుల సంఘం ఎరుకుల అభివృద్ధికి కృషి చేయాలని, ఎరుకొలకే కాక ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అన్ని బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉండి వాళ్లకి ఏ సమస్యలు వచ్చినా పరిష్కరిం చాలనుకోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ సిటీ గంగప్ప,రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం కృష్ణప్ప,దళిత నాయకులు ఎ.కుమార్,జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు,ఈస్ట్ పేట బాలాజీ, గుడిసిబండ గట్టప్ప, నారాయణ. తదురులు సంఘ నాయకులు పాల్గొన్నారు

# నేడు యూరియా పంపిణీ

**యాదమరి, జనవరి 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రైతులకు బుధవారం ఉదయం 10 గంటల నుండి దాసరాపల్లి, 12 కమ్మపల్లి, పత్రపల్లి రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. యూరియా అవసరం అయిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకంను తప్పనిసరిగా తీసుకెళ్ళాలని ఆమె పేర్కొన్నారు.

# తిరుపతి డివిజన్

## దామినేడు పిహెచ్‌సిని సందర్శించిన ప్రజారోగ్యశాఖ డైరెక్టర్

తిరుపతిరూరల్, జనవరి20 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)ని ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డిఎంహెచ్‌ఓ సంయుక్తంగా ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధాల లభ్యత, రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలు, రికార్డుల నిర్వాహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే మాతా-శిశు సంరక్షణ సేవలు, టీకాల కార్యక్రమం, ప్రసూతి సేవలు, ఎన్‌సిడి క్లినిక్, ల్యాబ్ సేవలు పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్‌సి పరిసరాలలో శుభ్రత, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా పని చేయాలని ఆదేశించారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ బాలక్రిష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో పిహెచ్‌సిల పాత్ర కీలకమని తెలిపారు. దామినేడు పిహెచ్‌సి సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామినేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి!



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వవెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అధికారులను సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని గురుకుల పాఠశాల, హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వంటగదిలోకి వెళ్ళి తయారు చేస్తున్న వంటలను వాడుతున్న సరకులను పరిశీలించారు. వండిన అన్నం సాంబారు, రసం, తాళింపులను ఆమె స్వయంగా రుచి చూసారు. ప్రభుత్వం సూచించిన మెను ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా? పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కోట్లు వెచ్చించి విద్యను ప్రోత్సహించాలని వసతి గృహాలను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించటంలో రాజీ పడకూడదన్నారు. రాజీ పడితే మీ చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు.

## పంటల పరిరక్షణకు పోషకాలు ఎంతో అవసరం



ఏర్పేడు,జనవరి 20 ప్రభాతవార్త పంటల పరిరక్షణకు పోషకాలను అందించాల్సిన అవసరం ఎంతైన అవసంఉ ఒదని జిల్లా వనరుల కేంద్రం అధికారి శ్రీనివాస్ వివరించారు. మండలంలోని రైతులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం సేంద్రీయ వ్యవసాయ ముందస్తు అభ్యసన గుర్తింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు అవసరమైన పోషకాలను ఘన ద్రవ జీవామృతాలు వంటి ద్వారా అందించవచ్చునన్నారు. వాటి తయారి విధానాలను వివరించారు. అలాగే పంటలకు ఆవహించే చీడపీడల నివారణకు వావిల్లాకు కషాయం,పుల్లటి మజ్జిగ, నీమాస్త్రం వంటివి పిచికారి చేయాలన్నారు. దీని ద్వారా చీడ పీడలను నివారించవచ్చునని శ్రీనావాస్ వివరించారు. ఈ విధంగా సేంద్రీయ ఎరువులు, కషాయాలు వాడటం వలన ఖర్చు తగ్గించుకుంటూ భూసారాన్ని పెంపొందిస్తూ నాణ్యమైన అధిక దిగుబడిని సాధించగలమని వివరించారు. ఈ కార్యక్రమాల్లో వ్యసాయాధికారి సాగరిక, జీవన ఎరువులైన అజోటోబాక్టర్, రైజోబియం, అజోల్లా,ఫాస్పరస్, సొల్యూబిలిసింగ్ బ్యాక్టరియా,పోటాష్, సొల్యూబులిసింగ్ బ్యాక్టరీయి వంటివి పశువుల ఎరువులతో కలసి భూమిలో వెదజల్లటం ద్వారా భూమిలో పోషకాలను పంటలకు అందే విధంగా చేయబడునని వివరించారు. ఈ ఎపిసిఎన్‌ఎఫ్ పథకంకు సంబంధించి మాస్టర్ ట్రైనర్ రంగయ్య,తిరుపతి ఎఇఓ మహేష్ పాల్గొన్నారు.

## బడుగు వర్గాల శత్రువు జగన్‌రెడ్డి



తొట్టంబేడు,జనవరి 20 ప్రభాతవార్త బడుగు వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అయితే బద్ధ శత్రువు జగన్‌రెడ్డి అని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధ్వజమెత్తారు. తనకు అధికారం లేదని పగతో రగిలిపోతున్న జగన్ రప్పారప్పా సంస్కృతి తీసుకొచ్చి వైసీపీ ఉన్మాదులతో ప్రజలను భయపెడుతున్నారని మరో బిసి నేతను బలి తీసుకున్నాడని ఆరోపించారు. కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకుని జన్మదిన వేడుకలకు వెళ్ళి తిరిగి వస్తూ ఉండగా మాటువేసి టిడిపి బిసి నేతలపై అతి కిరాతకంగా దాడి చేసిన సంఘటనలో బిసి నేత బంగారయ్య చనిపోగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయన్నారు. తునిలో బిసి నేత బంగాయ్యది వైసిపి సైకో నాయకుల ప్రేరిపిత హత్యే అని ప్రజలంతా పండగకు గాలి పటాలు ఎగురేస్తుంటే వైసిపి సైకో నాయకులు బిసి నేతల తలలు నరికే కార్యక్రమాల్లో ఉన్నారని దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివరించబారు. బిపి నేతలు మిన్నల్‌రవి, డాక్టర్ ఎం.ఉమేష్‌రావు బీమాల భాస్కర్‌ముదిరాజ్, కోట చంద్రశేఖర్ చిల్లకూరు మణి, సంజాకుల మురళీకృష్ణ, భాస్కర్,నాగరాజు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని బజారువీధిలో, బజారువీధుల్లో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో మహిళా భక్తుల కోలాటం పోటీ చేసుకుంది. కొత్తపేటలో వెలసిన ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండం మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచి మాల ధరించి ఆధ్యాత్మిక చింతనలో గడిపారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొజ్జల బృందమ్మ హాజరయ్యారు. ఆమెకు కమిటి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి బృందమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలను సారెను అందించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాట్‌పరీక్షల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి క్యాట్ పరీక్షల్లో విజయం సాధించారు. ఈ మేరకు ముఖ్యకార్యాలయం పాఠశాలలో అభినందన సభను ఏర్పాటు చేసారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి ఏడాది నేషనల్ లెవెల్ లో జరిగే నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ నందు ఈ ఏడాది కూడా పాల్గొని విజయం సాధించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన ఈ పరీక్షకు లెవెల్-2లో సెలెక్ట్ అయ్యారు 167 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 161 మంది సెలెక్ట్ అయ్యారు. 13 మంది విద్యార్థులకు నగదు బహుమతి,79మందికి మెడల్స్ 69మందికి విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.రూపాదేవి గారు మాట్లాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో డీన్ త్రివేణి,ఇన్‌చార్జి శ్రీహరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ చల్లని ఆశీస్సులందరికీ కలగాలి



తిరుపతి, జనవరి 20ప్రభాతవార్త: తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వైసిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వేడుకున్నారు. మాఘ మాసం ఆరంభం తొలిమంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మను వైసిపి ఎంపిటిసి వైసిపి సుబ్రమణ్యం,నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, వైసిపి నగర అధ్యక్షుడు మల్లం రవి చంద్రారెడ్డితోకలిసి కరుణాకరరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



తిరుపతిరూరల్, జనవరి 20 ప్రభాతవార్త: శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా అంకురార్పణ జరిగింది. తిరుపతిఅర్బన్ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో వెలసిన శ్రీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవములు ఈనెల 20వ తేది నుంచి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20న సాయంత్రం అంకురార్పణ, 21న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహనం, 22న ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనం, 23న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనము, 24న ఉదయం కల్ప వృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 25న ఉదయం మోహిని అవతారం, రాత్రి గరుడ వాహనం, 26న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, 27న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 28న ఉదయం మహా రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం, 29న ఉదయం చక్ర స్నానం, రాత్రి ధ్వజ అవరోహణం ఉంటుందని తెలిపారు.

## ఎథిక్స్,ఎన్విరాన్మెంటల్ ఎక్సామ్స్‌లో కూడా అర్హత సాదించాలి: ఆర్ఐఓ

తిరుపతి విద్య, జనవరి 20 ప్రభాతవార్త

ఇంటర్ విద్యార్థులు ఎథిక్స్ ఎన్విరాన్మెంటల్ ఎగ్జామ్స్‌లో కూడా తప్పనిసరిగా అర్హత సాధించాలని రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించే ఎథిక్స్ హూమన్ వాల్యూస్, పర్యావరణ విద్య సబ్జెక్ట్ లపై నిర్వహించే పరీక్షలలో తిరుపతి జిల్లా లోని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 30318 మంది, ఇదువరకు ఈ రెండు ఎక్సామ్స్ లో పెండింగ్ వున్న విద్యార్థులు కూడా హాజరు అయ్యి ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల లో అర్హతను సాధించాలి అని సూచించారు. ఈ నెల 21న ఏథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్, 23న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈరెండు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయి అని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరపు ఇంటర్ విద్యార్థులు తమ పబ్లిక్ ఎక్సామినేషన్ రిజిస్టర్ నెంబర్ తో పరీక్షలు రాయాలని, ఇంతకు ముందరి పరీక్షలలో ఫైల్ అయిన పాత విద్యార్థులు తమ పాత హాల్ టికెట్ నెంబర్ తో పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు. గమనిక: పైన రెండు పరీక్షలలో అర్హత సాధించని వారికి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబందించిన పాస్ సర్టిఫికెట్స్ జారీ కావని బోర్డు వారు తెలిపారు.

## కళాశాల ఆయనకు ఆరో ప్రాణం

విద్యార్థినులు ఆయన కన్నబిడ్డలు, ఆయన సేవలు అనన్యం
ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డికి పదోన్నతి



చంద్రగిరి, జనవరి 20 ప్రభాతవార్త: ఆయనకు కళాశాల అంటే ఆరో ప్రాణం, విద్యార్థినులే తన కన్నబిడ్డలుగా భావించే అరుదైన గురువు లభించడం చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు దక్కింది. జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖకు (27 మే 2025 నుండి డిఐఈఓ) ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన రాజశేఖర్ రెడ్డి జిల్లా విద్యాశాఖ వృత్తి విద్యా అధికారిగా (డివిఈఓ ఇంటర్మీడియెట్ బోర్డు) పదోన్నతిపై విజయవాడకు బదిలీ అయ్యారు. 2017 జూన్ 30న కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కళాశాలలో విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తుకు ఎటువంటి కొరతలు లేకుండా చూడాలనే ఆయనలోని తాపత్రయం నేడు కళాశాల సాధించిన ప్రగతికి తార్కాణంగా నిలుస్తుంది. ముఖ్యంగా విద్యార్థినులలో క్రమశిక్షణ అలవరచడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాల అంటే సమాజంలో పెద్దగా పట్టించుకునే స్థితిలో లేని పరిస్థితుల నుండి యావత్ రాష్ట్రం చంద్రగిరి బాలికల కళాశాల వైపు దృష్టి సారించేంతగా విద్యార్థినులు మార్కులు సాధించడం ఆయనలోని పట్టుదలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. కళాశాలకు కావలసిన తరగతి గదులు, విద్యార్థినులకు అవసరమైన వాటిపై ప్రణాళికలు ముందుగా నిర్ణయించుకుని దాతలను సంప్రదిస్తారు. తరగతి గదుల నిర్మాణం, సురక్షిత మంచినీటి కొరకు వాటర్ ప్లాంట్, ఈ విధంగా కళాశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూనే విద్యార్థినులలో పోటీ తత్వాన్ని పెంపొందించడానికి ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రకటించి అందించారు. ఇందులో భాగంగా ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్ఈసి, ఒకేషనల్‌లో మూడు గ్రూపులు నుండి మొత్తం 30 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.3 వేలు వంతున అందించిన గొప్ప గురువు ఆయన కాక మరెవరు కాగలరు. ఆయనతో కలసి పనిచేసిన అధ్యాపకులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు

చంద్రగిరి, జనవరి 20 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులైన దేవేరులతో స్వామివారు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, దిలీప్ రెడ్డి, అర్చకులు ఆంజనేయాచార్యులు, జమేధార్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ,

తిరుపతి రవాణ జనవరి 19 ప్రభాత వార్త



రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో తిరుపతిలో రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఎస్ వి ఆర్ట్స్ కళాశాల నుంచి తుడా, మునిసిపల్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, బాలాజీ బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో వాహనదారులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో అధికారులు, వాహనదారులు రోడ్డు భద్రతా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం నివారించడం, లేన్ క్రమశిక్షణ పాటించడం వంటి కీలక చర్యలపై దృష్టి సారించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 129 ప్రకారం హెల్మెట్ విధిగా ధరించాలని దీన్ని పాటించకపోతే సెక్షన్ 194డి ప్రకారం 1,000 జరిమానా, మూడు నెలల డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ విధించబడుతుందని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ లేకుండా పెట్రోల్ ఇవ్వకూడదనే నిర్ణయాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాస రావు, మోహన్ కుమార్, వెంకటరమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, బాలాజీ బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ మరియు సెక్రటరీ హరిప్రసాద్ మొదలైనవారు పాల్గొన్నారు.

## కాటయ్య కుటుంబానికి అండగా నిలిచిన కూరపాటి శంకర్‌రెడ్డి

కేవీబీ పురం, జనవరి 20 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలం అంజూరు పాళెం దళితవాడలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త కాటయ్య పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా నేలమట్టమైంది. ఈ విషయం తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పానభాక లక్ష్మిలు, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు యస్వంత్‌రెడ్డితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించి 20 వేలు ఆర్థిక సాయం చేసి, నిత్యావసర సరకులు స్టౌవ్, బియ్యం, బట్టలు కాటయ్య కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామి యాదవ్, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి గోపినాథ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, అంజూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఈ ప్రిన్సిపాల్ మా కొద్దు

వడమాలపేట, జనవరి 20 ప్రభాతవార్త:



అధ్యాపకులను, కార్యాలయ సిబ్బందిని వేధిస్తున్న ప్రిన్సిపాల్ మాకొద్దు అంటూ వడమాలపేట జూనియర్‌కళాశాలలో మంగళవారం ఆందోళన చేపట్టి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. రెండు నెలల క్రితం సంజీత్‌నాయక్ అనంతపురం నుంచి బదిలీపై వడమాలపేట జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. కొద్ది రోజులు పని చేసిన ఆయన ఎవరితోను సఖ్యతగా ఉండక అందరిని ఇబ్బంది పెట్టారు. తరువాత మెడికల్ సెలవులో వెళ్లారు. సోమవారం కళావాలకు వచ్చిన ఆయన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన డిల్లీబాబుని, సీనియర్ అసిస్టెంట్ భువనేశ్వరి, హిందీ అధ్యాపకులు లోకనాథ్‌లను హాజరు పట్టికలో పేర్లు తొలగించి మిమ్మలను టెర్నినేట్ చేశాను మీరు కాలేజీకి రావాల్సిన పని లేదని తెలిపారన్నారు. అ కారణంగా ఏదో ఒకటి మాట్లాడుతూ అందరిని ఇబ్బంది పెడుతున్నారని మానసికసమస్యలతో బాదపడే ఆయనను ప్రిన్సిపాల్‌గా కొనసాగించడం సరికాదని అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. వీరికి తల్లిదండ్రులు మద్దతుగా నిలవడంతో కళాశాలలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తిరుపతి డీఐఈవో రాజశేఖర్, వడమాలపేటకు వచ్చారు. అధ్యాపకులతోను, ప్రిన్సిపాల్‌తో విడి విడిగా చర్చించారు. అక్కడి పరిస్థితులను సమీక్షించారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని అంత వరకు సామరస్యంగా అందరూ పని చేయాలని సూచించారు.

## వైకాపా శ్రేణులు దాడులు ఆపాలి : బృందమ్మ

శ్రీకాళహస్తి,జనవరి 20ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్‌పై పెనుబాక గ్రామానికి చెందిన వైకాపా మూకలు దాడి చేయటం హేయమైన పని అని బొజ్జల బృందమ్మ ఖండించారు. మంగళవారం ఆమె శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిషోర్‌ను పరామర్శించారు. బొజ్జల సుధీర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ది పథంలో నడిపిస్తుంటే చూసి ఓర్చుకోలేక కార్యకర్తలపై దాడి చేయటం వారి నీచ సంస్కృతి నిదర్శనం అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఏ కార్యకర్తలకు అన్యాయం జరిగిన దాడులు చేసినా సహించేది లేదన్నారు.

## ఎస్వీ వైద్య కళాశాలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం



తిరుపతి హెల్త్, జనవరి 20, ప్రభాతవార్త శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి విశిష్టత గురించి ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.ఎన్ మూర్తి అమ్మవారికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మోహన్ ఫోరెన్సిక్ విభాగ ప్రొఫెసర్ మాట్లాడుతూ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆర్యవైశ్య (కోమటి) కుల ఆరాధ్య దేవత. ఆమె ధర్మం, సత్యం, త్యాగం, శక్తి యొక్క ప్రతిరూపంగా భావించబడు తోందన్నారు. ఎన్జీవో తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు మాట్లాడుతూ అధర్మాన్ని ఎదిరించి, సత్యాన్ని నిలబెట్టిన దేవతగా ప్రసిద్ధి. కన్యకా రూపం ఆమె బ్రహ్మచారిణిగా, కన్యకా స్వరూపంలో ఆరాధించబడుతోందన్నారు. అగ్ని ప్రవేశ మహత్యం పౌరాణిక కథనం ప్రకారం, అన్యాయాన్ని తట్టుకోలేక వాసవి దేవి తన అనుచరులతో కలిసి అగ్నిలో ప్రవేశించింది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏటుకూరి గిరిబాబు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు త్యాగం ఆమెను మహాశక్తిగా నిలిపిందని తెలిపారు. వైశ్య కుల రక్షక దేవత వ్యాపారం, నైతికత, సమృద్ధి, కుటుంబ సంక్షేమం కోసం ఆమెను వైశ్యులు ప్రత్యేకంగా పూజిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల అనాటమీ విభాగ ఆచార్యులు, డాక్టర్ జగదీష్ బాబు, ఆఫీస్ సూపరిటెండెంట్ రేణుక, ఎస్వీ వైద్య కళాశాల ఆఫీస్ సిబ్బంది, పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి మేము సైతం



తిరుపతి కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త :రక్తదానం చేయడానికి మేము సైతం అంటూ తిరుపతి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు ముందుకొచ్చారు. ప్రతినెల 20వ తేదీన అసోసియేషన్ నెలవారీ సమావేశంలో భాగంగా మంగళవారం స్థానిక గాంధీ భవన్లో సభ్యుల సమావేశం జరిగింది. ఇంతలో స్విమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ, లివర్ వ్యాధితో చికిత్స పొందుతున్న సాటి మెకానిక్ కుమార్ (30)కు రక్తం అత్యవసరమని అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి పిలుపు మేరకు 6 మంది మెకానిక్ లు ముందుకొచ్చి రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. ఇకపై అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడానికి మెకానికులు కూడా ముందు ఉండాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి తెలిపారు. అలాగే ప్రతిఒక్కరు లేబర్ లైసెన్సులు మరియు మున్సిపాలిటీ లైసెన్సులు కచ్చితంగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ తరపున మెకానిక్ కుమార్ కు రూ.5,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జలంధర్, ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి గురు ఆచారి, కమిటీ ఇన్చార్జి కేశవ, సభ్యులు మురగ, ఇంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే



సత్యవేడు, జనవరి 20 ప్రభాతవార్త పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు. ప్రభుత్వ ఆస్పత్రు లకు వచ్చేపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం గా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం ఉదయం సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక సీహెచ్‌సీలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో 24 గంటలు వైద్యులు అందుబా టులో ఉండాలని, అన్ని రకాల మందులు స్టాక్ ఉండాలని, వైద్యులు సిబ్బంది, వసతులు కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి ఆపరేషన్ థియేటర్, మందులు స్టాక్ రికార్డులను పరిశీలిం చారు. ఈ నెల 22న నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో తలపెట్టిన జాబ్‌మేళా పోస్టర్లను ఎమ్మెల్యే మంగళవారం సత్యవేడులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

పుత్తూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరనలు, అర్చనలు చేశారు. అలాగే ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమానికి హాజరై విశేష పూజలు చేశారు.

## వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిరాజుకి సత్కారం

పుత్తూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త: పుత్తూరు సీపిఐ పార్టీ మండల కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ అధ్యక్షులుగా ఎన్నికైన రవిరాజ్‌కి శాలువతో సత్కరించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ రవిరాజు పుత్తూరు ప్రాంతమే కాకుండావైద్య అధికారిగా ఉమ్మడి జిల్లా మొత్తం ఎందరికో వైద్య రీతిలో సేవలు అందించాలని ప్రజల దగ్గర ప్రశంసలు పొందారని, అదే విధంగా వాకర్స్ అసోసియేషన్‌లో కూడా ఎందరికో అవగాహన కల్పిస్తూ ఆరోగ్యపరంగా దృఢంగా ఉండాలంటే ముందు నడక ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. వీధి విక్రయదారుల సంఘం పుత్తూరు అధ్యక్షుడు నవీన్ హమాలి వర్కర్స్ యూనియన్ రమణ, నాయకులు దిలీప్, గోకుల్, బద్రి, లోకేష్, విజయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

రేణిగుంట, జనవరి 20 ప్రభాతవార్త ప్రభుత్వ స్థలాల లో, ప్రకృతి వనరులలో తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రేణిగుంట తాహసి ల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారక రామానగర్ నందు కొండను చదును చేస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో తాహసిల్దార్ సంఘటన స్థలం చేరుకొని గుట్టను చదును చేసి రాళ్లను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కొండను తవ్వుతున్నట్లు ఫిర్యాదు అందడంతో సంఘటన స్థలానికి ఆర్ ఐ జయ కృష్ణ సిబ్బందితో చేరుకుని రెండు ట్రాక్టర్లలో రాళ్లను లోడ్ చేయడం గుర్తించామన్నారు. ప్రభుత్వ స్థలం నుండి రాళ్లను తరలించడం నేరమని రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

## ఆరోపణలు నిరూపిస్తే బహిరంగ క్షమాపణకు సిద్ధం

రేణిగుంట, జనవరి 20 ప్రభాతవార్త



కొండలు తవ్వి ప్లాట్లు చేసి టిడిపి నేతలు అమ్ముతు న్నట్లు వచ్చిన ఆరోపణలను రుజువు చేస్తే రేణిగుంట గాంధీ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణకు సిద్ధమని నిరూపించలేక పోతే ఏం చేస్తారని కరకంబాడి టిడిపి క్లస్టర్ ఇన్చార్జి బుజ్జి నాయుడు సవాలు విసిరారు. టిడిపి నేతలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం కరకంబాడి టిడిపి కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాల్సిన అవసరం టిడిపి నేతలకు లేదన్నారు. తమపై ఆరోపణలు గుప్పించిన విషయం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. సమావేశంలో దాదాపు 50 మంది టిడిపి నేతలు పాల్గొని తమపై వచ్చిన ఆరోపణలను ఖండించారు.

## రిజర్వేషన్లపై న్యాయస్థానం తీర్పు హర్షణీయం

రేణిగుంట జనవరి 20 ప్రభాతవార్త.



రిజర్వేషన్ కేటగిరీలో ఉన్న అభ్యర్థులకు జనరల్ కేటగిరి కట్ ఆఫ్ మార్కులు కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే వారిని ఓపెన్ క్యాటగిరి నందు సర్దుబాటు చేయాలంటూ సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం సంఘర్షణ సమితి అధ్యక్షుడు, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి , బిజెపి యువనేత పూల వెంకటాద్రి యాదవ్ అన్నారు. రిజర్వేషన్ లేని ఓపెన్ క్యాటగిరి రిజర్వేషన్ వర్తించని వర్గాల కోసం ఏర్పాటుచేసిన కోటా కాదని అన్నారు. అభ్యర్థుల ప్రతిభకు ఓపెన్ క్యాటగిరి కొలమానమని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలు జరిపి బిసి, ఎస్సీ, ఎస్టి వర్గాలకి సామూహిక న్యాయంతో చేయాలని ప్రభుత్వాలను కోరారు.

## కన్యకా పరమేశ్వరి దేవికి విశేష పూజలు

పాకాల, జనవరి 20, ప్రభాతవార్త:శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా మంగళవారం రోజున పాకాల పట్టణం బజారు వీధిలో ఉండు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభించి మూలవిరాట్‌కు అభిషేకం, ఉత్సవరులకు పాలు, పంచామృతం మొదలగు వాటితో అభిషేకం కుంకుమార్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వి.ఎస్.బద్రి నారాయణ, ఆర్యవైశ్య కమిటీ మెంబర్లు ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి తనిఖీ



వాకాడు, జనవరి 20 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు పోలీస్ స్టేషన్ ను మంగళవారం నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం వాకాడు రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని ఆగి ఉన్న పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయం నిర్మాణంను డిఎస్పి చెంచు బాబు పరిశీలించారు. సీఐ హుస్సేన్ భాషా ద్వారా పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. డిఎస్పి చంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని క్రైమ్ పరంగా స్టేషన్ అండ్ సర్కిల్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి అవాంఛను జరగకుండా చూసుకుంటున్నారు అన్నారు. ముందస్తుగా జరిగే కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టారన్నారు. రానున్న ప్రత్యేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఆయన వెంట సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష, సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి



తడ, జనవరి 20 ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ఉపయోగించుకుని ప్రతి మహిళ వ్యాపార వేత్తగా ఎదగాలని తడ ఏపీఎం రాజారెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ సీడ్ క్యాపిటల్ పొందిన లబ్ధిదారు లందరూ పీఎం ఎఫ్ఎంఇ ద్వారా వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసుకు వెళ్లాలని తద్వారా అధికంగా ఆదాయాన్ని పొందవచ్చని, పెద్ద వ్యాపారస్తులకు దీటుగా పోటీగా మహిళలను నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. పి.చంద్రబాబు, సిసిలు అకౌంటెంట్ పాల్గొన్నారు.

## ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన స్వరూప



వెంకటగిరి, జనవరి 20 ప్రభాతవార్త: గుంటూరు జిల్లా మేడికొండూరు నుండి ఎస్సైగా స్వరూప వెంకటగిరి బదిలీ అయ్యారు. సీఐ ఏవి రమణను, ఎస్ఐ స్వరూప మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. చోరీల నివారణపై నిఘా ఏర్పాటు చేస్తానని తెలిపారు.

## కన్యకా పరమేశ్వరి దేవికి పట్టు వస్త్రాలు సమర్పణ



నాయుడుపేట, జనవరి 20 ప్రభాత వార్త: నాయుడు పేటలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మహత్య సందర్భ ంగా మంగళవారం పట్టణంలోని శ్రీవా సవి కన్యకా పరమేశ్వరి దేవికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నెలవల సుబ్రహ్మణ్యం దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా నిలబడుతుందని వారు ఈ సందర్భంగా అన్నారు. అనంతరం తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి అండగా నిలబడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సూళ్లూరుపేట నియోజకవర్గం తొలి మహిళ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నిలవల సుబ్రహ్మణ్యంలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న పోలవరం ప్రాజెక్టుకి శ్రీ పొట్టి శ్రీరాములు పేరును పెట్టాలని ఆయన విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెసల జయరాజు గోపాల్, అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కామర్లపూడి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు గాదంశెట్టి భాస్కర్, గాదంశెట్టి నాగరాజు, కరీం భాయ్ చెంచయ్య, రాఘవేంద్ర సిమెంట్స్ సురేష్ బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యభక్తుల సుదర్శనంకే ప్రాధాన్యత

**-గుడిమల్లం ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం**



ఏర్పేడు, జనవరి 20 ప్రభాతవార్త: భారత దేశంలోనే మొదటి శివాలయం అయిన గుడిమల్లంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల్లో సామాన్య భక్తులకే పెద్ద పీట అని విఐపిలకు ప్రత్యేక సమయ పాలన కేటాయింపుకు మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశం తీర్మానిం చింది, చైర్మెన్ బత్తల గిరినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యుల సందేహాలను ఇఓ రామచంద్రారెడ్డి నివృత్తి చేసారు.ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతున్న గుడిమల్లం అలయంలో జరుగుతున్న జీర్ణోద్ధారణ కార్యక్రమాలకు సంబంధించి సమీక్షిం చారు. అయితే శివరాత్రికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సమావేశం సూచించారు. అయితే వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సాయంత్రం వరకు ఉన్నా వారికి ఆకలి దప్పులు తెలియకుండా నిత్య ప్రసాదాలు అందించాలని సమావేశం తీర్మానించింది. విఐపిలకు శివరాత్రి పర్వదినాన ఉదయం 9గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సమయం కేటాయించినట్లు వివరించారు. విఐపిలు ఈ ఏర్పాటును పరిశీలించి సద్వినియోగం చేసుకోవాలని సమావేశం తీర్మానించింది. అలాగే ఆ రోజు మాత్రం వన్‌వే అమలు చేయాలని పోలీసు శాఖను కోరారు. తిరుపతి నుంచి వచ్చేవారు పాపానాయుడుపేట మీదుగా గుడిమల్లం చేరుకొని స్వామివారిని దర్శించుకొని తిరుగుపయనంలో చెల్లూరు,సిసిఎల్ మీదుగా తిరుపతికి చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. భక్తులకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిత్యాన్నదాన కార్యక్రమంలో భోజన వసతి కల్పించాలని సమావేశం తీర్మానించారు. సమావేశంలో అరుణ,ఉష,కిరణ్‌రాయల్,నిరంజన్,బాబు,గీతా,రాజకుమార్, హంస,ఆలయ పూజారి వంశీకృష్ణలు పాల్గొన్నారు.

## సంస్కృత వర్శిటీలో జాతీయ సదస్సు ప్రారంభం



తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాతవార్త: తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా సమితి, నవదేహిలి వారి సహాయోగంతో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. సంస్కృత భాషలో వివిధ ఆధునిక విషయాలను విద్యాలయాలలో బోధించే విధానం గురించి కళాశాల అధ్యాపకులకు మార్గదర్శనం చేయడం జరుగుతున్నది.ఈ సదస్సు సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్కృత భారతి సంస్థ అఖిలభారత ప్రశిక్షణ ప్రముఖులు శ్రీరాం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకించి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు మొదలైన చుట్టుపక్కల జిల్లాల నుండి విచ్చేసిన సంస్కృత ఉపన్యాసకులు,అధ్యాపకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విత్తాధికారి ఆచార్య రాధా గోవింద్ త్రిపాఠి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డా.సోమశి సీతారామ శర్మ, డా.కుమార్ బాగేవాడి మఠ్ లు సంయోజకులుగా వ్యవహరించారు.

## వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కేవీబీ పురం, జనవరి 20 ప్రభాతవార్త: వంద మంది వైసీపీ కార్యకర్తలు సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి కూరపాటి శంకర్‌రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో తెలుగుదేశం కార్యాలయంలో పనబాక లక్ష్మి మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని రాష్ట్రాన్ని గ్రామాలను వ్యక్తులను సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి చేస్తున్న దానిని చూసి వైసీపీ కార్యకర్తలు టీడీపీ పార్టీలోకి చేరారని తెలిపారు. అనంతరం వైసీపీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కండ్లూరు గ్రామం డి.మాధవరెడ్డి, తిమ్మ సముద్రం పంచాయతీ దొరబాబునాయుడు, బొజ్జయ్య కండ్రిగ మునస్వామి, బాలాజీ కొనియా కండ్లూరు పంచాయతీ డి.మాధవరెడ్డి, తిమ్మ సముద్రం పంచాయతీ నుంచి సర్పంచ్ దొరబాబునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## శ్రీ పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టిన గ్రామస్తులు



నాయుడుపేట, జనవరి 20 ప్రభాతవార్త: నాయుడు పేట మండల పరిధిలోని పెరికిలింపాటి కండ్రిగ గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామ దేవత శ్రీశ్రీపోలేరమ్మకు పొంగళ్ళు పెట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాలతో స్థానిక తెలుగుదేశం పార్టీనేత బల్లి ముత్యాలయ్య తమ సొంత నిధులతో శ్రీ పోలేరమ్మ చెట్టు వద్ద రచ్చబండ నిర్మించారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం శ్రీశ్రీ పోలేరమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్ళు పొంగించి తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విన్నమాల పంచాయితీ వార్డు మెంబర్లు దాసరి శ్రీనివాసులు, కార్న సుధాకర్, పలువురు దేశం నాయకులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ : ఆర్డీవో



వెంకటగిరి, జనవరి 20 ప్రభాతవార్త: అర్హులైన రైతులందరికీ ప్రతినెల రాజముద్ర ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. రైతు ఫోటో, రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. వెంకటగిరి మండలంలో 8000 పాస్ పుస్తకాలు గాను 45 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండో విడత కూడా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 24వ తేదీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని సమాచారంతో బహిరంగ సభ ప్రదేశాలను ఆర్డిఓ పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, ఆర్విఎం ఉన్నత పాఠశాల క్రీడామైదానం లను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ నరసింహారావు, ఇన్చార్జి కమిషనర్ సాంబశివరావు, ఆర్ అండ్ బిడిఈ శ్రీనివాసులు, సిఐ ఏవి రమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు శ్రీరాములు నాయుడు ఉన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరించి...బాధితులకు అండగా వుంటా!

**- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**



నాయుడుపేట, జనవరి 20 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజక వర్గ అభివృద్ధికి మీడియా మిత్రులు సహకరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, 2024 ఎన్నికల సమయంలో మీ సహకారం మరువలేనిదని కొనియాడారు. సేవే లక్ష్యంగా తాను రాజకీయాల్లోకి వచ్చానని, పదవుల కోసం కాదని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే రాజకీయా ల్లోకి వచ్చానని తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు నేరుగా తనకు మెసేజ్‌లు, ఫోటోలు పంపి వారి సమస్యలను వివరిస్తున్నారని తెలిపారు.ప్రతి సమస్యను పరిష్కరించి, బాధితులకు అండగా ఉండటమే ప్రాధాన్యతగా పని చేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల చిరకాల కోరికైన ఇళ్ల స్థలాల విషయంలో తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి మీడియా ప్రతినిధికి ఇళ్ల స్థలం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల మంత్రులు, ముఖ్య మంత్రిలను కలిసి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వాస్తవాలను ప్రచురించాలన్నారు. నియోజకవర్గ ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, చిల్లకూరు పిఎసిఎస్ డైరెక్టర్ పెళ్ళకూరు గోపాలకృష్ణ, నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జివిఆర్ నాయుడు, ఓజిలి, పెళ్ళకూరు, సూళ్లూరుపేట మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, కొక్కు శంకరయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగాప్రసాద్, తిరుపతి పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, నియోజకవర్గంలోని వివిధ పత్రికల రిపోర్టర్లు, టీవీ ఛానళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భగవంతుని సేవతో జన్మ సార్ధకత

**-పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్**



కాణిపాకం, జనవరి 20 ప్రభాతవార్త: భగవంతుని సేవతో జన్మ సార్ధకత అవుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. కాణిపాకం దేవస్థానంలో గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 21 రోజుల పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశిష్ట సేవలందించిన వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందికి మంగళవారం స్థానిక ఆస్థాన మండపంలో అభినందన సభ నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యమ్రానికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుని దగ్గర సేవ చేసే అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతమన్నారు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జరిగిన బ్రహ్మోత్సవాల విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో సేవా దృక్పథంతో పనిచేశారని కొనియాడారు. బ్రహ్మోత్సవాల సందర్బంగా ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అందరికి సకాలంలో సంతృప్తికర దర్శనం కల్పించడానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది అందించిన సేవలు అభినందనీయ మన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడు తూ బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ నూతన టెక్నాలజిని అందిపుచ్చుకుని ఎలాంటి చిన్న పాటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణి నాయుడు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉభయదారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ ఉభయదారుల సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి కారులు సుధారాణి, వెంకట ప్రసాద్, ఆలయ ఈఈ వెంకట నారాయణ, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, డీఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెంటెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, స్థానాచార్యులు మణిస్వామి,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెణిక కుల ధ్రువీకరణ పత్రాల సమస్య పరిష్కారానికి కృషి

**-ఆత్మీయ సన్మానసభలో చైర్మెన్ వనపర్తి వీరభద్రరావు హామీ**



తిరుపతిరూరల్, జనవరి20 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెణిక కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఎదురవుతున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పెణిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ వనపర్తి వీరభద్రరావు తెలిపారు. మంగళవారం స్థానిక యూత్ హాస్టల్లో నిర్వహించిన ఆత్మీయ సన్మానసభలో వీరభద్రరావు పాల్గొన్నారు. పెణిక కులస్తుల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటుందని తెలిపారు. విద్యార్థులకు తక్కువ వడ్డీతో విద్యాఋణాలు, ఉపాధి కల్పనకు ఎంఎస్ఎంఈ ద్వారా ప్రోత్సహకాలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బి.సిల అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. పెణిక కులస్తులందరూ ఐకమత్యంగా హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వీరభద్రరావును దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకా గుర్రప్ప, దేవరాజులు, పరమశివయ్య, కె.రాజేంద్ర, పోకల రామకృష్ణయ్య, చింతా వెంకట శివయ్య, సముద్రాల నాగేశ్వరరావు, జి మదన్‌మోహన్, సింగంశెట్టి శివశంకర్, రెడ్డి శేఖర్, బి.నరేంద్ర, జి.చంద్రమౌళి, పురుషోత్తం, టి.వెంకట సిద్దయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంజన్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలి



తిరుపతి విద్య, జనవరి 20 ప్రభాతవార్త: ఎస్వీయూ లా డిపార్ట్మెంటులో అకడమిక్ కన్సల్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అంజన్ సింగ్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వీసీ టాటా నరసింగరావుకు ఆధారాలతో వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ అశోక్ కుమార్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న వారు ఇతర ఏ ఉద్యోగాలు చేయకూడదని యూనివర్సిటీ అధికారులు ముందు గానే డిక్లరేషన్ తీసుకుంటారని తెలిపారు. అయితే ఈ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ అంజన్ సింగ్ అకడమిక్ కన్సల్టెంట్‌గా కొనసాగుతూ, ఒకేసారి తిరుపతి జిల్లా కోర్టులో న్యాయవాదిగా కూడా విధులు నిర్వహిస్తున్నాడని. ఇది యూనివర్సిటీ నిబంధనలకు, బార్ కౌన్సిల్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని త్వరలో నేరుగా బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. దీనిపై వీసీ టాటా నరసింగరావు స్పందిస్తూ తక్షణమే అతన్ని పిలిపించి నోటీసులు ఇస్తామని, రాబోయే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో అతని ఉద్యోగం కొనసాగించాలా వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు నరసన్న, గర్ల్స్ కన్వీనర్ అనిత, నాయకులు నరేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి

**-జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలునందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) జరిగిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సింగిల్ డెస్క్ విధానంలో డిసెంబర్ 2025 నుండి 2135 పరిశ్రమలకు గాను 1946 అనుమతులు ఇచ్చామని మరో 188 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలు పరిశీలన కమిటీకి అందిన మేరకు 12 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 9.05 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 7,విద్యుత్ సబ్సిడీ 1, వడ్డీ రాయితీ4, యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి, కలంకారీ క్లస్టర్, శ్రీకాళహస్తి, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షి ంచి వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు వివరిస్తూ నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ మరియు ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి రాష్ట్ర స్థాయి ఆమోదం పొంది ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ అమరయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి విజయ భరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎపిడిడిఆర్‌డిఏ ప్రభావతి, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ ధార్మిక కార్యక్రమాలు సదాసాగాలి

**-విద్యాస్వరూపానందస్వామి**



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన వెలసిన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం భక్తి శ్రద్దలతో దివ్యదినోత్సవాన్ని ఆశ్రమ పీఠాధి పతి విద్యాస్వరూపానందగిరి స్వామి సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో భక్తి భావం వెల్లి విరిసింది. పట్టణా నికి చెందిన భక్తులు తండోపతండాలుగా హాజరయ్యారు.శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ హోమాలకు సంబంధించి ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపా నందగిరి స్వామి మాట్లాడుతూ ఈ ఆశ్రమాన్ని సద్గురు మలయాళ స్వామి దివ్య హస్తాలతో ప్రారంభించారన్నారు.ఈ దినాన్ని పురస్కరించుకొని నేడు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆశ్రమం సారధ్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్యసాదుపాయాలు, ధార్మిక కార్యక్రమాలు సదా నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని వివరించారు.ధార్మిక కార్యక్రమాలు మహోన్నతంగా భక్తులకు ఉపయోగపడేటట్లు ఉండాలని సూచించారు. నాడు ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు విద్యాప్రకాశానంద స్వామి గీతా మకరందం ప్రవచనాలు దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొందాయన్నారు. పండిత పామరులకు సన్మార్గంలో నడుపుటకు ఎంతో ఉపయోగపడిందన్నారు.ఈ ఆశ్రమాన్ని 1950 మాఘమాసంలో సద్గురు మలయాళ స్వామి ప్రారంభించారన్నారు.ఆశ్రమం ప్రారంభమైన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా మలయాళస్వామి, విద్యాప్రకాశానందగిరి స్వామి చిత్రపటాలకు విశేష పూజలు నిర్వహించారు.

**ఆగమోక్తంగా హోమాలు:**

ఆశ్రమ ప్రారంభ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆశ్రమ ఆవరణలో పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి హోమాలు నిర్వహిం చారు. ఓ వైపు హోమాలు మరో వైపు భగవద్గీత నామస్మరణ,భజనలతో మిన్నుముట్టాయి.సుమారు నాలుగుగంటల పాటు సాగిన హోమాలు పూజల సందర్భంగా పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి పూర్ణాహుతి గావించారు.

## దివ్యాంగజన దివ్య దర్శన యాత్ర విజయవంతం



తిరుమల,జనవరి 20 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో హైదరాబాద్‌కు చెందిన అష్టోత్తర శత (108) చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో“ దివ్యాంగజన దివ్య దర్శనం” కార్యక్రమం మంగళ వారం విజయవంతంగా జరిగింది. కుప్పం నియోజక వర్గానికి చెందిన దివ్యాంగ భక్తులు శ్రీవారి దర్శనం మంగళవారం తిరుమలలో చేసుకున్నారు. తిరుమలకు వచ్చే భక్తుల బృందం బస్సును టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి. ఎస్. మునిరత్నం జెండా ఊపి ప్రారంభించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో మొత్తం 69 మంది పాల్గొన్నారు. వీరిలో 40 మంది దివ్యాంగ భక్తులు, 20 మంది వాలంటీర్లు, 9 మంది ట్రస్ట్ సమన్వయకర్తలు ఉన్నారు.ఈ 11వ దివ్యాంగజన సేవ యాత్ర ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,889 మంది భక్తులు శ్రీవారి దర్శన భాగ్యాన్ని పొందారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వేణు చుక్కల మాట్లాడుతూ ఈ పవిత్ర సేవా కార్యక్రమం విజయవంతానికి ప్రోత్సాహం, మార్గదర్శకం ,పరిపాలనా సహకారం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థుల బదిలీపై నాడు అంగీకారం... నేడు తిరస్కారం

చంద్రగిరి, జనవరి 20 ప్రభాతవార్త: అరిగెలవారిపల్లి నుండి పనపాకం మధ్యన ఎంత దూరం వున్నదీ గ్రామస్థులకు తెలియనిది కాదు. అరిగెలవారిపల్లిలోని ప్రాథమిక పాఠశాల (3,4,5) తరగతుల విద్యార్థులను పనపాకం ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేయడాన్ని అంగీకరిస్తూ ఎస్ఎంసి కమిటీ 2025 ఏప్రిల్ 11న తీర్మానం చేసింది. 2025 ఏప్రిల్ 21లోపు ప్రభుత్వం ప్రతిపాధించిన పాఠశాలలో పిల్లలను చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇదే తీర్మాణంలో కోరారు. అయితే విద్యార్థుల బదిలీ వెనుక గల కారణాలను పరిశీలిస్తే పనపాకం ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం ఆదర్శ పాఠశాలగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో పిల్లల ఉజ్వల భవిష్యత్తు రీత్యా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పాఠశాల నిర్వహణలో గణనీయమైన మార్పులు, నాణ్యమైన విద్యాబోధనలతో అన్ని విధాలుగా ఆదర్శ వంతంగా పాఠశాలను తీర్చిదిద్దను ండటంతో అరిగెలవారిపల్లి విద్యార్థులను సైతం బదిలీ చేయడానికి పేరెంట్స్ అంగీకరించారని చెబుతున్నారు. ఇటువంటి సమయంలో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పనపాకం పాఠశాలకు పంపబోమని చెప్పడం పట్ల నాడు అంగీకరించి నేడు తిరస్కరించడమేంటని పలువురు పేరెంట్స్ వాపోతున్నారు. ఆదర్శ పాఠశాలకు పిల్లలను బదిలీ చేయడాన్ని నిలువరించడం ద్వారా స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లల భవిష్యత్తును శరాఘాతానికి గురిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన పాఠశాల కాస్త దూరంగా వున్నప్పటికీ తల్లిదండ్రులే స్వయంగా తమ పిల్లలను తీసుకెళ్ళి పాఠశాలలో దింపడం, సాయంత్రం తిరిగి తీసుకురావడం జరుగుతుంది. మరి ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతుండటం పట్ల పేరెంట్స్‌కు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, గ్రామానికి చెందిన విద్యావంతులు, ఉపాధ్యాయులు తీసుకోవాల్సి వున్నది.